క్లుప్తంగా

సమాచారం లేకుండా ఆక్రమణల తొలగింపా..!



సత్తెనపల్లి: ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పట్టణంలోని మాచర్ల రోడ్‌లో బుధవారం ఆక్రమణల తొలగింపు ప్రక్రియను మున్సిపల్ ప్లానింగ్ అధికారులు చేపట్టారు. చికెన్ దుకాణాల ముందు రాకపోకలకు అనువుగా ఉండేలా సిమెంట్‌తో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాంలను పగలగొట్టారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా ఆక్రమణలు తొలగించడం ఏమిటంటూ చికెన్ వ్యాపారులు ఆవేదన వెలిబుచ్చారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఆక్రమణలు తొలగించదల్చుకుంటే పార్టీలకు అతీతంగా హోలీ ఫ్యామిలీ పాఠశాల వద్ద గల మదర్ థెరిసా విగ్రహం నుంచి చెక్‌పోస్ట్ వరకు, గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న దుకాణ సముదాయాలను పరిశీలించి మున్సిపల్ కాలువల హద్దు మీరి బయటకు వచ్చిన వాటన్నింటిని తొలగించాలన్నారు. కనీసం కొంత సమయమైనా ఇవ్వకుండా పగలగొట్టడం సరైనది కాదని, పట్టణ ప్రణాళిక అధికారుల తీరును వారు తప్పుబట్టారు.

రేపు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమావేశం

సత్తెనపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమావేశం ఈ నెల 18న ఉదయం 7 గంటలకు పట్టణ గుంటూరు రోడ్‌లోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని ఖండ సంఘ్ చాలక్ చలువాది చిన సత్యనారాయణ బుధవారం తెలిపారు. వక్తగా భాగ్యనగర్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరవుతారన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దొడ్లేరులో ఉచిత కంటి పరీక్ష శిబిరం



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో సచివాలయం వద్ద ధూళిపాళ్ల ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందికి ఉచిత కళ్ల జోళ్లు అందించేందుకు, 15 మందికి కంటి ఆపరేషన్లకు ఆసుపత్రికి రిఫర్ చేసారు. ఈ శిబిరంలో కంటి పరీక్షల టెక్నీషియన్స్ సునీత, పోసిపోగు స్వర్ణమేరీ, మల్లేష్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నివేశన స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలి

తహసీల్దార్ ఎస్.ధనలక్ష్మి



పెదకూరపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ స్కీమ్‌లో భాగంగా ఇంటి నివేశన స్థలం లేని నిరుపేదలందరూ గ్రామ సచివాలయం ద్వారా అర్జీని దాఖలు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ధనలక్ష్మి బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఇంటి స్థలం లేని వారు అర్జీతోపాటు కుటుంబానికి జారీ చేసిన రేషన్ కార్డు, కుటుంబ సభ్యులందరి ఆధార్ కార్డులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను జతపరచాలన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



అచ్చంపేట: మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 63 మంది విద్యార్థులకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ వారు గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్ చేతుల మీదుగా బుధవారం నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమ ఫౌండేషన్ సభ్యులు తోడ్పడుతున్నారన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ల్యాప్‌టాప్‌లు వంటివి పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘం మాజీ చైర్మన్ పొన్నెకంటి గోవిందరావు, ఎస్సీ నాయకులు శిఖా నాగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కలుపు నివారణతో దిగుబడి అధికం

- అంతర కృషే సరైన మార్గం
- పంటకు సరిపోయే మందును సరైన మోతాదులో వాడాలి



దిడుగు వద్ద పత్తి చేలో అంతర కృషి చేస్తున్న రైతు



నరుకుళ్ళపాడులో పత్తిలో కలుపు తీస్తున్న కూలీలు

అమరావతి: రైతులు సాగు పెట్టుబడిలో సుమారు 30 శాతానికి పైగా పంటలలోని కలుపును తొలగించటానికి ఖర్చు చేయాల్సి వస్తుంది. కలుపు మొక్కలు ఎక్కువగా పెరగటంతో దిగుబడి, పంట నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రధానంగా పత్తి పంటలో కలుపు సమస్యకు కారణాలు అనేకం. రైతులు సమయాభావం వల్ల పొలాన్ని సరిగా దున్నకపోవటం, సిఫార్సు చేసిన దాని కంటే ఎక్కువ మోతాదులో ఎరువులు వేయడం, సరైన నీటి యజమాన్య పద్ధతులు పాటించకపోవడం వంటి కారణాల వల్ల కలుపు అధికంగా పెరుగుతుంది. దీంతో పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోవటమే కాకుండా తెగుళ్లు, పురుగులు పంటలకు ఆశించే అవకాశం కూడా ఉంది.

సకాలంలో నిర్మూలించాలి

రైతులు సకాలంలో కలుపును నిర్మూలిస్తే దిగుబడులు పెరగటంతో పాటు సాగు వ్యయాన్ని కూడా తగ్గించవచ్చు. అంతేకాక కలుపు మందుల వాడకంపై అవగాహనతో పాటు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు సరైన మోతాదులో ఎరువులు వాడాలి. కూలీల లభ్యత లేకపోవటం, పెరిగిన కూలీ రేట్ల కారణంగా కలుపు నివారణకు కూడా రైతులు రసాయనిక మందులపైనే ఆధారపడుతున్నారు.

పెరుగుతున్న ఖర్చు

మండలంలో రైతులు ఇప్పటికే సుమారు 13 వేల ఎకరాలలో పత్తి పంటను వేశారు. పత్తిలో తొలి ఆరు వారాల దశ ఎంతో కీలకం. మండలంలో ముందుగా విత్తిన పత్తి పంటలో రైతులు కలుపులు తీయటం ప్రారంభించారు. పత్తి విత్తిన 13వ రోజు నుంచి అంతర కృషి చేయటం వల్ల 50 శాతం వరకు కలుపును నివారించవచ్చు. కానీ నేడు పశువుల అరకలతో వ్యవసాయం తగ్గిపోవటంతో చేలల్లో అంతర కృషికి కూడా యంత్రాలను నమ్ముకోవాల్సి వస్తుంది. ఈ యంత్రాలు గ్రామాలలో రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవటంతో కూలీలతో కలుపు తీయించాల్సిన పరిస్థితి. దీంతో ఖర్చు పెరుగుతుంది.

అంతర కృషి తప్పక చేయాలి



కలుపు నివారణకు కలుపు మందులు వేసినప్పటికీ 25 నుంచి 30 రోజుల వరకు వ్యవసాయ పనిముట్లతో అంతర కృషి తప్పక చేయాలి. పంటకు సరిపోయే కలుపు మందులు సరైన మోతాదులో సరైన సమయంలో వాడాలి. విత్తనం వేసిన 24 నుంచి 48 గంటలలోపు పొలంలో పదును లేకపోతే యూరియా, పదును ఉంటే స్టాంప్ అనే రసాయనిక మందును పిచికారీ చేయాలి. కలుపు మందును పవర్ స్ప్రేయర్‌తో కాకుండా, హ్యాండ్ స్ప్రేయర్‌తోనే స్ప్రే చేయాలి. భూమిలో బాగా పదును ఉన్నప్పుడు మాత్రమే కలుపు మందులు చల్లటం లాభదాయకం. కలుపు మందులను ఉదయం లేదా సాయంత్రం మాత్రమే పిచికారీ చేయాలి. – ఎస్‌కే అహ్మద్, మండల వ్యవసాయాధికారి

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె తప్పదు



మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నినదిస్తున్న మున్సిపల్ కార్మికులు

సత్తెనపల్లి: పది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇంజనీరింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె తప్పదని మున్సిపల్ కార్మికులు అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా 4వ రోజు బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతం చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, అనారోగ్యంతో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని, ప్రమాద మరణానికి ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలని, మట్టి ఖర్చులు రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రదర్శన అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నినదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం సకాలంలో చెల్లించాలి



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



రైతులకు పంటల బీమాపై వివరిస్తున్న బీమా జిల్లా డీఎం నింగయ్య

నకరికల్లు: వాస్తవ కౌలుదారు రైతులు కౌలు ధ్రువీకరణ పత్రాలతో వీఆర్వోలను సంప్రదించి సీసీఆర్‌సీ కార్డులను పొందాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్‌తండా గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పొందేందుకు మిర్చి, కంది పంటలకు జూలై నెలాఖరులోగా బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. వరి పంట సాగు చేస్తున్న రైతులు ఆగస్టు 15లోగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కంది పంటకు ఎకరాకు రూ.40, మిర్చికి రూ.360, వరి పంటకు రూ.80 ప్రీమియం చెల్లించాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, క్రాప్ కల్టివేషన్ సర్టిఫికెట్‌తో కామన్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించి బీమా పథకాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’

పెదకూరపాడు : మండలంలోని చిన్నమక్కెన, లింగగుంట్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పంటల బీమా జిల్లా డీఎం నింగయ్య ముఖ్య అతిథిగా హాజరై పంటల బీమా గురించి వివరించారు. మండలంలోని రైతులందరూ తమ భూములకు ఈ పంట నమోదు చేసుకోవాలని, నమోదైన రైతులకే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. 2025 పంటల బీమాకు సంబంధించి కందికి రూ.40, మిర్చికి రూ.360 ప్రీమియం చెల్లిస్తే పంటల బీమా వర్తిస్తుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. వరికి రూ.80 ప్రీమియం చెల్లించాలని, ఆగస్టు 15 వరకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టాలి



కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి: న్యాయవాదుల పై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. న్యాయవాది మేరిగ మోహనరావు, అతని భార్యపై సంఘ విద్రోహశక్తులు చేసిన దాడిని ముక్త కంఠంతో సత్తెనపల్లి న్యాయవాదులు ఖండించారు. పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి నినదించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. సోమవారం రాత్రి తుళ్లూరుకు చెందిన న్యాయవాది ఎం.మోహనరావు, అతని భార్యపై కొందరు సంఘ విద్రోహశక్తులు తీవ్రంగా దాడి చేయడాన్ని ఖండించారు. న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి, న్యాయ వాదులపై జరుగుతున్న దాడులను ఖండించండి, తుళ్లూరు న్యాయవాది, అతని భార్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చిన్నం మణిబాబు, న్యాయవాదులు బీఎల్ చిన్నయ్య, ఖాజావలి, దివ్వెల శ్రీనివాసరావు, రాజశేఖరుని గోపాలకృష్ణ మూర్తి, చావా బాబురావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, చవల బాల కోటయ్య, కాకర్ల నాగహరిబాబు, బొక్కా సంగీతరావు, మన్నెం వెంకటేశ్వరరావు, గంటా వెంకట శివ, రాజవరపు నరసింహారావు, నాగుర్, గుజ్జర్లపూడి సురేష్, యేసురత్నం, జోజి, రామాంజీ, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు పర్యటన

బెల్లంకొండ: వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం బెల్లంకొండ మండలంలో పర్యటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ మండల స్థాయి సమావేశాన్ని చంద్రాజుపాలెం గ్రామంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కిశోర బాలికలకు అవగాహన సదస్సు



క్రోసూరు: గుడ్ షెపర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరులోని జై భారత్ హైస్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ మండల ఇన్‌చార్జ్ తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిస్టర్ యాంటో పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ కల్పించిన జీవన్ నైపుణ్యాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సమాజంలో ఆడపిల్లలు ముందుకు రావాలంటే ఈ జీవన నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో జై భారత్ స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కేసుల రాజీతో సత్వర న్యాయం

- మీడియేషన్ ఫర్‌ది నేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నరేంద్రరెడ్డి



ర్యాలీ ప్రారంభిస్తున్న నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మీడియేషన్ ఫర్‌ది నేషన్ పై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ర్యాలీని అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు వద్ద నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమాని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎటువంటి కేసులనైనా రాజీ చేసుకోవచ్చని వెల్లడించారు. ఇలా రాజీ చేసుకోవడం వలన ఎన్నో ఏళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు వ్యయప్రయాసలు తగ్గుతాయని చెప్పారు. దీనివలన కోర్టు సమయం వృథా కాకపోవడంతో పాటు మిగిలిన కేసులను త్వరగా విచారించి పరిష్కరించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు షేక్ రహంతుల్లా, పి.హజరతయ్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేకం



పెదకూరపాడు: వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ పెదకూరపాడు గ్రామంలో బుధవారం గ్రామస్తులు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామస్తులంతా బిందెలతో నీళ్ల తెచ్చి బొడ్రాయి విగ్రహాలతో పాటు గ్రామ దేవతలు, ఆలయాల్లోని దేవతామూర్తులకు అభిషేకం చేసి వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, రైతు సంఘం నాయకులు భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ అంద్ర ప్రసాదు, తెలుగు యువత గల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను ఆయిల్‌పామ్ తట్టుకుంటుంది

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ఆయిల్‌పామ్ ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా తట్టుకుంటుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బట్లూరు గ్రామంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ అవగాహన సదస్సు పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఆయిల్ పామ్ సాగుకు 8 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. 8 మండలాల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి సత్తెనపల్లి, రాజుపాలెం మండలాలను ఎంపిక చేయటం సంతోషంగా ఉందన్నారు. తెగుళ్లు, చీడ పీడలు తక్కువగా ఉంటాయన్నారు. ఆయిల్‌పామ్ గెలలను రైతుల నుంచి నేరుగా కంపెనీ వారు కొనుగోలు చేస్తారన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది మండలాలను ఆయిల్‌పామ్ సాగుకు గుర్తించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మండలంలోని బట్లూరు గ్రామంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టి 15 ఎకరాల్లో ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ సాగు, రాయితీ గురించి రైతులకు వివరించారు. గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ డీజీఎం మురళి మాట్లాడుతూ మండలంలో దాదాపు 250 ఎకరాలను ఆయిల్ పామ్ సాగుకు గుర్తించడం జరిగిందన్నారు. కంపెనీ ద్వారా ఆయిల్ పామ్ గెలలను కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉద్యాన అధికారి సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, బట్లూరు సర్పంచ్ రామారావు, పోపూరి శేషగిరి కుమారి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశాల మేరకు వినుకొండ పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులను అధికారులు బృందం తనిఖీ లు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎరువులు, పురుగు మందుల లైసెన్స్‌లను, స్టాక్ రిజిస్ట ర్లు, ఇన్వాయిస్ తనిఖీ చేయుట జరిగింది. ప్రతి డీలరు తప్పనిసరిగా స్టాక్ బోర్డు నిర్వహించాలని, స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో ప్రతిరోజు అప్‌డేట్ చేసుకోవాలని రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎంఆర్‌పీ రేట్లకు మించి విక్రయించినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్‌లో నిల్వ లు గోదాముల్లో నిల్వలు పరిశీలించడం జరిగింది. తనిఖీల్లో కమిటీ సభ్యులు పి.జి.బుజ్జిబాబు, మహమ్మద్ ఉమర్, బి.సుబ్బారెడ్డి, వినుకొండ ఏవో జి. వరలక్ష్మి పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో పలు ఎరువుల దుకాణాలను అంతర్ జిల్లా అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాక్ బుక్స్ బిల్లులు ఇన్వాయిస్, భౌతిక నిల్వలు పరిశీలించారు. అదే విధంగా స్టాక్ నిల్వలు వివరాలు ప్రతిరోజు స్టాక్‌బోర్డు యందు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు ఎరువుల మందులు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ తనిఖీల్లో ఏలూరు జిల్లా కోట రామచంద్రపురం సహాయ సంచాలకులు పి.బుజ్జిబాబు, విజయవాడ రీజనల్ విజిలెన్స్ విభాగపు ఇన్‌స్పెక్టరు ఆఫ్ పోలీసు మహమ్మద్ ఉమర్, నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి ఆంజనేయ నాయక్‌లు ఉన్నారు.

అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అధికృత డీలర్ల వద్ద కొనుగోలు చేయా లని పాకెట్ మీద ఉన్న లాట్ నంబరు కొనుగోలు రసీదు మీద లాట్ నంబరు కూడా ఒకే విధంగా ఉండేలా దుకాణాదారులు చూడాలని అంతర్ జిల్లా కమిటీ అధికారి ఏలూరు జిల్లా కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.జి.బుజ్జిబాబు అన్నారు. బుధవారం శావల్యాపురంలో ఎరువుల, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ఎరువుల కట్టలపై ముద్రించినటువంటి ధరలకే కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఎరువుల కొరత లేకుండా నిరంతరం మండల స్థాయి వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబదింత డీలరు వద్ద నుంచి తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. అనంతరం సొసైటీ గోదాంలో ఎరువుల నిల్వలు రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో మహమ్మద్ ఉమర్, సుబ్బారెడ్డి, ఏవో రామినేని రామారావు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు ఉన్నారు.

విచారణకు హాజరైన గుంటూరు మాజీ మేయర్

యడ్లపాడు: గుంటూరు నగర మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో యడ్లపాడు మండలంలోని చెంగిచుఖాన్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద విషయమై విచారణ కోసం వచ్చారు. విచారణలో పొందిన సమాచారం, ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు.

రేపు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో 2003లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్–2, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాత పెన్షన్ విధానం సాధనకై ఈ నెల 18న గుంటూరులో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం కన్వీనర్లు సలగాల ప్రసన్నకుమార్, శీలంయలమంద, రాయిడి శ్రీధర్, మారెళ్ల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలులో ఉన్నప్పుడు మొదలైన నియామక ప్రక్రియను అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నూతన పెన్షన్ విధానంలోకి బలవంతంగా తీసుకరాబడ్డామని వివరించారు. ఆట మొదలైన తరువాత నిబంధనలు మార్చకూడదన్న కనీస న్యాయాన్ని కూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం న్యాయంగా రావలసిన పాత పెన్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వానికి నిరసన తెలియజేయాల్సి ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ధర్నాకు ఎస్‌టీయూ ఏపీ మద్దతు..

2003 డీఎస్సీ ఉపాధ్యాయులు చేపట్టిన ధర్నాకు ఎస్‌టీయూ ఏపీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నట్టు పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఎ.ఏమండీ తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

న్యాయవాదుల వన్‌కే వాక్



వినుకొండ : జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పట్టణంలో మధ్యవర్తిత్వం– దేశం కోసం అనే 90 రోజుల కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు వన్‌కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.మహతి పాల్గొన్నారు. అనంతరం కోర్టు నందు మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబరు 30వ తేదీ వరకు జరుగుతుందని, మధ్యవర్తిత్వం ద్వారా వినుకొండ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ కక్షిదారులు రాజీ చేసుకొని పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ నాయక్, ఎస్‌ఐ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ నాయకులు పి.గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, పీవీ రమణరెడ్డి, వి.శివశంకర్‌బాబు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.